సొంతింటి ఆశలపై ఆంక్షలు

- మార్చిలోగా పూర్తి చేయాలని షరతులు
- పెరిగిన గృహ నిర్మాణ సామగ్రి ధరలు
- అవేమీ పట్టించుకోకుండా ఆందోళనకు గురిచేస్తున్న కూటమి ప్రభుత్వం



పొన్నాడలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

కొత్తపల్లి: ఇళ్లులేని నిరుపేదలు ఉండకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు విలువైన ఇళ్ల స్థలాలను మంజూరు చేసి పట్టాలను సైతం అందజేసింది. కానీ కూటమి ప్రభుత్వం రావడంతోనే పేదల సొంతింటి ఆశలపై ఆంక్షలు విధించింది. పునాది స్థాయిలో ఉన్న నిర్మాణాలకు మార్చిలోగా గోడలు, శ్లాబు దశలో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించింది. దీంతో లబ్ధిదారుల గుండెల్లో గుబులు రేగుతోంది. కోలనీలలో ఇంటి పట్టాలు అందుకున్న కొంతమంది అనివార్య కారణాలలో పునాది వరకు నిర్మించారు. ప్రభుత్వ తాజా నిర్ణయం లబ్ధిదారులకు ఆందోళన కలిగిస్తోంది. నియోజకవర్గంలో 9759 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకూ సమారు 4320 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ పరంగా రూ.1.8 లక్షలు ఆర్థిక సాయంతో పాటు డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.35 వేలు బ్యాంకు రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. గతంలో లే అవుట్ల ఏర్పాట్లలో జాప్యం, లబ్ధిదారులు సకాలంలో ముందుకు రాకపోవడంతో ఇళ్ల నిర్మాణంలో అలస్యం చోటు చేసుకుంది.

లబ్ధిదారులపై ఒత్తిడి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల కోసం ప్రైవేటు వెంచర్లను తలపించేలా లే అవుట్లు వేసి ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. విశాలమైన రహదారులు, విద్యుత్, తాగునీటి వసతులు కల్పించారు. మార్చిలోగా అన్ని రకాల నిర్మాణాలు పూర్తి కాకపోతే ఇళ్లు రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వ హెచ్చరికలతో పాటు, ఇసుక, ఐరన్, కూలి ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో లబ్ధిదారుల పరిస్థితి అయోమయంగా మారిపోయింది. పాలన పగ్గాలు చేపట్టి 8 నెలలైనప్పటికీ కూటమి ప్రభుత్వం కొత్త ఇళ్ల మంజూరుకు వెబ్‌సైట్ తెరవక పోగా, లబ్ధిదారులను ప్రోత్సహించకుండా మన ఇల్లు– మన గౌరవం పేరుతో హంగామా చేస్తోంది. గతం కంటే ఎక్కువ స్థలాన్ని, అధిక రుణాన్ని ఇస్తామంటూ ఆశ చూపుతోంది. కానీ నేటికీ ఒక్క స్థలాన్ని కానీ, రుణం కూడా ఇచ్చిన దాఖలాలు లేవు.



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ శాఖ అధికారులు

నియోజకవర్గంలో మంజూరైన ఇళ్ల వివరాలు

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి
గొల్లప్రోలు	1214	664
పిఠాపురం	1386	953
కొత్తపల్లి	2314	1254
గొల్లప్రోలు అర్బన్	2473	992
పిఠాపురం అర్బన్	2372	457

బిల్లుల సమస్య లేదు



ఇళ్ల లబ్ధిదారులకు బిల్లుల సమస్యలేదు. ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కలిప్తున్నాం. నిర్మాణాలను మధ్యలో నిలిపివేసిన లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ మార్చి నెలలోపు నిర్మాణాలు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉందని అవగాహన కల్పిస్తున్నాం. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారికి వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకూ 575 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు.

– కె.వెంకట నూకరాజు, ఏఈ

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు పశువుల మందులు అందజేస్తున్న నాయకులు, అధికారులు

సామర్లకోట: పశువైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ సర్జన్ కిరణ్మయి అన్నారు. మండల పరిధిలో పి.వేమవరంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకొని మూగ జీవుల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. సచివాలయ పరిధిలోని పశువైద్య శాఖ ఉద్యోగి రాజు అందిస్తున్న సేవలపై రైతులు వైద్యుల దృష్టికి తీసుకు వెళ్లారు. రాజు నిత్యం అందుబాటులో ఉండి రైతులకు కావలసిన సలహాలు, సూచనలు ఇస్తున్నారని వివరించారు. దాంతో ఆయన సేవలను గుర్తించి నీటి సంఘ అధ్యక్షుడు మేడిద విఘ్నేశ్వర నాగబాబు ఆధ్వర్యంలో రాజును సత్కరించారు. ఈ శిబిరంలో డాక్టర్ గంగాభవాని, గ్రామ నాయకులు రాధాకృష్ణ, మాగాపు పాపయ్యమ్మ, కామధేను చారిటబుల్ ట్రస్ట్ గోశాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువులకు కావలసిన మందులను అందజేశారు.

పిఠాపురం: పశుసంవర్ధక శాఖ నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ రైతులకు సూచించారు. ఆయన గొల్లప్రోలు ఏరియా పశువైద్యశాలలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో పశువులకు నట్టల నివారణ మందులు తాగించి, గర్భకోశ వ్యాధులకు ఉచితంగా చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే 200 గొర్రెలకు మసూచి వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గొల్లప్రోలు మండలంలో పవువైద్య శిబిరాలను నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ హిమజ, ప్రశాంత్, ఎల్ఎస్ఏ పద్మావతి తదితర సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.



పి.వేమవరంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరం

వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

సామర్లకోట: పట్టణంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సంగీతరావుపేటకు చెందిన నాయీ బ్రాహ్మణులు ఏటా త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా త్యాగరాజస్వామి చిత్రపటానికి నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు వెదురుపాక కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రత్యేక వేదికపై చిత్రపటాన్ని ఉంచి సంగీతరావుపేటలోని రామాలయం నుంచి బళ్ల మార్కెట్, చిన్నవీధి, పెద్దవీధి, గణపతిశాస్త్రి ఇంటి నుంచి గొల్లగూడెం మీదుగా తిరిగి రామాలయం వరకు నగర సంకీర్తన నిర్వహించారు. ఏడిద గ్రామానికి చెందిన నాయీ బ్రాహ్మణ, స్థానిక కళాకారులు సంగీత కచేరీ నిర్వహించారు. జనవరిలో త్యాగరాజ వర్థంతిని పురస్కరించుకుని భారతీయ సంగీత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్టు వెదురుపాక కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు సీనియర్ కళాకారులను సత్కరించారు. స్థానిక సంగీత కళాకారుల సంఘ నాయకులు వెదురుపాక బలరాం, మల్లేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో త్యాగరాజు ఉత్సవాలు నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం రామాలయంలో త్యాగరాజ కీర్తనలు సాయంత్రం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వెదురుపాక శ్రీను, బందల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



త్యాగరాజ స్వామికి నివాళులు అర్పించిన నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

పాతికేళ్ల నాటి సందడి



ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

పిఠాపురం: చదువులమ్మ చెట్టు నీడలో చెట్టాపట్టాలేసుకుని కలసి తిరిగిన 25 ఏళ్లనాటి ఆ విద్యార్థులు మంగళవారం కలుసుకుని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. శాంతి ఆశ్రమం శాంతి ఎయిడెడ్ హైస్కూల్ 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కలుసుకుని కేక్ కట్ చేసి సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఆశ్రమం ఓంకార్ స్వామీజీ జయంతి సందర్భంగా స్వామీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలనాటి పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆటపాటలతో సందడి చేశారు. వివిధ వృత్తుల్లో, ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడి వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. వయసు పైబడిన సంగతిని మర్చిపోయి చిన్న పిల్లల్లా వినోద కార్యక్రమాలలో పాల్గొన్నారు.

బులి వెంకాయమ్మ సత్రానికి మహర్దశ

- నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు
- విరాళం ఇవ్వనున్న ధర్మకర్త మాణిక్యాంబ
- సత్రాన్ని పరిశీలించిన డీసీ రమేష్‌బాబు

కరప: మండలం వేళంగిలోని పాతూరి బులి వెంకాయమ్మ సత్రాన్ని దేవదాయ, ధర్మదాయ శాఖ ఉభయ గోదావరి జిల్లాల డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు మంగళవారం సందర్శించారు. మండల పర్యటనలో భాగంగా ఆయన శిథిలావస్థకు చేరిన సత్రాన్ని పరిశీలించారు. సత్రం భవనాన్ని తొలగించి, నూతన భవన నిర్మాణానికి ఆలయ గ్రేడ్–1 ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు ఆయన సత్రాన్ని పరిశీలించి మాట్లాడుతూ సత్రం వంశపారంపర్య ధర్మకర్త మెర్ల సరోజ మాణిక్యాంబ స్పందించి భవన నిర్మాణానికి కొంతసొమ్మును విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. సత్రం కోసం చిన్న భవనాన్ని నిర్మించి, మిగిలిన ఖాళీ స్థలంలో దుకాణాల సముదాయాన్ని నిర్మిస్తామన్నారు. దీని వల్ల ఆదాయం పెరుగుతుందన్నారు. అనంతరం ఆయన కరపలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయం శిథిలావస్థకు చేరిందని, పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సింగిల్ ట్రస్టీ పెద్దింటి గోపాలకృష్ణ, అర్చకుడు అనంతాచార్యులు డీసీకి వివరించారు. ఎంఎస్ఎన్ చారిటీస్ ఏసీ కె.విజయలక్ష్మి, ఈఓ కె.తిరుమల రవితేజ పాల్గొన్నారు.



బులి వెంకాయమ్మ సత్రాన్ని పరిశీలిస్తున్న డీసీ రమేష్‌బాబు

పెట్టుబడి ఆవశ్యకతపై అవగాహన సదస్సు

బాలాజీచెరువు: ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పెట్టుబడి అవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ ఎనలిస్ట్ త్యాగరాజన్ సుబ్రహ్మణ్యన్ హాజరై పెట్టుబడులకు సంబంధించిన ఈక్విటీ షేర్లు, బాండ్లు, ఈటీఎఫ్, మ్యూచువల్ ఫండ్స్ గురించి వివరించారు. అలాగే ఇన్‌కమ్, సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరుణ, వైస్ ప్రిన్సిపాల్ నాగశ్రీకాంత్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి అబ్రహం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- రైల్వే పెన్షనర్ల సంక్షేమ సంఘం డివిజన్ కార్యదర్శి కామేశ్వరరావు
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా

సామర్లకోట: విశ్రాంత రైల్వే ఉద్యోగులు, కార్మికులకు అండగా ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ పని చేస్తుందని విజయవాడ డివిజన్ కార్యదర్శి ఎ.కామేశ్వరరావు అన్నారు. స్థానిక బ్రాంచి విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఎంవీవీ రమణ అధ్యక్షతన మంగళవారం స్థానిక రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో పెన్షనర్ల 13వ సర్వసభ్య సమావేశం జరిగింది. 2004లో కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానం ప్రవేశ పెట్టిందని, దీంతో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొత్త పెన్షన్ విధానం వల్ల విశ్రాంత రైల్వే ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సెకండరీ ఫామిలీ పెన్షన్ పెండింగ్ కేసులు పరిష్కరించాలన్నారు. పింఛనుదారు మరణిస్తే భార్యకు పెన్షన్, అర్హత ఉన్న కుటుంబ సభ్యులకు పెన్షన్ అందజేయాల్సి ఉండగా ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

స్థానిక రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. యూనియన్లు వేరైనా ఉద్యోగులు, కార్మికుల కోసమేనని అన్నారు. యూనియన్ల కృషి మేరకే ఎనిమిదో వేతనం సంఘాన్ని నియమించినట్టు తెలిపారు. ప్రతి ఉద్యోగి పదవీ విరమణ చేయాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం వసతులపై ఐక్యంగా పోరాడాలని తెలిపారు. స్థానిక బ్రాంచి కార్యదర్శి వీవీఎస్ ప్రసాద్ ఫ్యామిలీ మెంబర్స్ అలెవెన్సు రూ.మూడు వేలు ఇవ్వాలని, ఎడిషనల్ పెన్షన్ పెంచాలన్నారు. కమ్యూటేషన్ కాల పరిమితిని 15 ఏళ్ల నుంచి 11 ఏళ్ల మూడు నెలలకు తగ్గించాలని, 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న డీఏ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్యదర్శి నివేదికను అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక..

సమావేశం అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎంవీ రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.రాజబాబు, ఉపాధ్యక్షులుగా డి.వీరభద్రరావు, ఎం.నాగేశ్వరరావు, ఎస్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా వీవీఎస్ ప్రసాద్, సహాయ కార్యదర్శిగా కె.నూకరాజు, కోశాధికారిగా కె.సుబ్బారావు 10 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. సమావేశంలో జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీ రమణారావు, ప్రధాన కార్యదర్శి జీఎస్ శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొని పెన్షనర్లు ఐక్యతతోనే సమస్యలు పరిష్కరించుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. సమావేశంలో సీనియర్ పెన్షనర్లను సత్కరించారు.



సీనియర్ పెన్షనర్లను సత్కరించిన సంఘం ప్రతినిధులు

క్లుప్తంగా

చురుగ్గా గుర్రపు డెక్క తొలగింపు



ఐదు తూముల వద్ద సాగుతున్న గుర్రపు డెక్క తొలగింపు పనులు

సామర్లకోట: గోదావరి కాలువలో పెరిగిపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులకు ఇరిగేషన్ అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ నెల 9వ తేదీన స్థానిక విలేకరి షేక్ సలీమ్ (36) ఇక్కడి గోదావరి కాలువపై నూతనంగా నిర్మించిన వంతెనపై నుంచి దూకిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పోలీసులు గాలిస్తున్నారు. పెరిగిపోయిన గుర్రపు డెక్కలో చిక్కుకుని అతని చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారుల విజ్ఞప్తి మేరకు జేసీబీ సాయంతో ఇరిగేషన్ అధికారులు కాలువలో గుర్రపు డెక్క తొలగింపును ప్రారంభించారు. సలీమ్ మృతదేహం గుర్రపు డెక్కలో చిక్కుకుని ఉంటే దుర్గంధం వచ్చే అవకాశం ఉంది. అయితే గోదావరి కాలువ వెంబడి ఎక్కడా అటువంటి చెడు వాసన రావడం లేదని స్థానికులు చెప్తున్నారు. అయితే సలీమ్ ఏమయ్యాడనే చర్చ జరుగుతోంది.

తాగునీటి వృథా



బ్రౌన్‌పేటలో పబ్లిక్ కుళాయి నుంచి వృథాగా పోతున్న తాగునీరు

సామర్లకోట: గతంలో అందరూ తాగునీటి కుళాయిలు వేయించుకునే అవకాశం లేకపోవడంతో మున్సిపాలిటీ పరిధిలో ప్రజల అవసరాల మేరకు పబ్లిక్ కుళాయిలను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం ఈ కుళాయిలకు ప్లాస్టిక్ హెడ్‌లు ఏర్పాటు చేయడంతో అవి తరుచూ విరిగి నీరు వృథా అవుతోంది. స్థానిక సత్యనారాయణపురంలో కొంత మంది ఆకతాయిలు కుళాయిలను తిప్పి వదలి వేస్తున్నారు. స్థానిక బ్రౌన్‌పేట అంబేడ్కర్ పార్కు వెనుక భాగంలో ప్రజల అవసరం కోసం పబ్లిక్ కుళాయిని ఏర్పాటు చేశారు. ఆ కుళాయి మూతి పోవడంతో నీరు వృథాగా పోతోంది. ఆ ప్రాంత ప్రజలు కుళాయి మూతికి కర్ర పెడుతున్నాయి. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో నీరు వృథాగా పోతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు కుళాయిలకు ఇనుప మూతులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శివరాత్రి ఉత్సవాలపై 26న సమీక్ష

సామర్లకోట: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన భక్తులతో సమావేశం నిర్వహించనున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 26వ తేదీన మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారి కల్యాణం, ఉత్సవాల ఏర్పాట్లపై భక్తుల సూచనలు, సలహాలను తీసుకోనున్నట్టు ఆయన తెలిపారు. సమావేశంలో భక్త సంఘ సభ్యులు, దీపారాధన సంఘ సభ్యులు, రైతులు, భక్తులు పాల్గొనాలని కోరారు. అనంతరం, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో మరో సమావేశం ఉంటుందని తెలిపారు.

రాష్ట్ర ఖోఖో జట్టు క్రీడాకారిణికి సత్కారం



పావనిని సత్కరిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నేషనల్ స్కూల్ గేమ్స్ ఆటలపోటీలలో రాష్ట్ర ఖోఖో జట్టు తరఫున పాల్గొని తిరిగి వచ్చిన క్రీడాకారిణి భోగిరెడ్డి పావని శ్రీమణిచంద్రికను పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పావని ఖోఖో అండర్–14 రాష్ట్ర బాలికలజట్టుకు ఎంపికై, మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగిన జాతీయస్థాయి ఆటల పోటీలలో పాల్గొనడం అందరికీ గర్వకారణమని సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు పేర్కొన్నారు. అనంతరం పావనిని అభినందించి సత్కరించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎన్.ప్రసాద్‌కుమార్, పీడీలు కె.శ్రీనివాస్, బి.చంద్రశేఖర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిశ సభ్యురాలిగా అనూష

కరప: మండలం గొడ్డపాలెం సర్పంచ్ గోన అనూష డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ మోనిటరింగ్ కమిటీ (డీఐఎస్‌హెచ్ఏ) సభ్యురాలుగా నియమితులయ్యారు. అనంతరం ఆమె కాకినాడలోని ఎంపీ ఉదయభాస్కర్ క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

సామర్లకోట: ఆధార్‌లోని సమస్యలను పరిష్కరించుకోవడానికి ఆయా గ్రామాల్లో బుధవారం నుంచి ఈ నెల 24 వరకు ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21, 22 తేదీలలో పనసపాడు, జి.మేడపాడు, ఉండూరు గ్రామాలలోను, 23, 24 తేదీలలో పీబీ దేవం, మాధవపట్నం, అచ్చంపేట పంచాయతీ కార్యాలయాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రెండో విడతలో 27, 28 తేదీల్లో పనసపాడు, జి.మేడపాడు, ఉండూరులోను, 29, 30 తేదీల్లో పీబీ దేవం, మాధవపట్నం, అచ్చంపేటలో శిబిరాలు ఉన్నాయని తెలిపారు.

జాబ్ మేళాలో 24 మంది ఎంపిక



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, డీఆర్‌డీఏలు మంగళవారం సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాలో 24 మంది ఎంపికైనట్లు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, టీమ్ లీజ్ కంపెనీ, డక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 48 మంది హాజరయ్యారు. సిడాప్ మేనేజరు కిరణ్, జాబ్స్ మేనేజరు శివ పాల్గొన్నారు.

సేవే లక్ష్యంగా సంకురాత్రి సేవలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులతో డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు

కాకినాడ రూరల్: సేవే లక్ష్యంగా సంకురాత్రి ఫౌండేషన్ ద్వారా శ్రీకిరణ్ కంటి ఆస్పత్రితో కంటి వైద్య సేవలు, సరస్వతి విద్యాలయ ద్వారా విద్యా బోధన చేస్తున్నామని పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ తెలిపారు. సంకురాత్రి ఫౌండేషన్ 32వ వార్షికోత్సవాన్ని మండలం పెనుమర్తి గ్రామ పరిధిలోని శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి ప్రాంగణంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. చంద్రశేఖర్‌తో పాటు ఓఎన్‌జీసీ ఈడీ రత్నేష్‌కుమార్, కోరమాండల్ యూనిట్ హెడ్ సీహెచ్.శ్రీనివాసరావు, సీ పోర్టు సీఓఓ మురళీధర్, అరబిందో ఫార్మా సీఎస్ఆర్ డిపార్టుమెంట్ జీఎం డి.సుధాకర్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంకురాత్రి ఫౌండేషన్ ద్వారా శ్రీకిరణ్ కంటి ఆస్పత్రితో అందించిన వైద్య సేవల వివరాలను డాక్టరు చంద్రశేఖర్ వెల్లడించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అతిథులు ఆస్పత్రి ద్వారా పేదలకు అందుతున్న సేవలను కొనియాడారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న వసుధ

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిరంలో సంక్రాంతి గాన సభల్లో భాగంగా మంగళవారం రాత్రి చెన్నైకు చెందిన వసుధ గాత్ర కచేరీ అందరినీ ఆకట్టుకుంది. వసంత వర్ణంతో ప్రారంభించి, ఆరభి రాగంలో త్యాగరాజు స్వామి ఘనరాగ పంచరత్న కీర్తన సాధించెనే ఓ మనసా, అన్నమాచార్యుల వారి హిందోళం రాగంలో గరుడగమన కీర్తనలు ఆలపించి అందరినీ మైమరపించారు. గాత్ర కచేరీకి వయొలిన్‌పై చిన్మయి, మృదంగంపై సద్గురు చరణ్ చక్కటి సహకారం అందించారు. తొలుత కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్‌వీఎస్ రావు, బుర్రా పద్మనాభం, వెన్నపు చక్రధర్, వక్కలంక రామకృష్ణ ప్రారంభించారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని నగరపాలక సంస్థ కమిషనర్ భావన హెచ్చరించారు. మంగళవారం వెంకట్‌నగర్, డీమార్ట్, రామకృష్ణారావు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమె పర్యవేక్షించారు. ఇంటింటికీ చెత్త సేకరణ తీరును పరిశీలించారు. బహుళ అంతస్తుల భవనాల నుంచి చెత్త సేకరణ అంశంపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడను స్వచ్ఛ కాకినాడగా తీర్చిదిద్దేందుకు ప్రజలు కూడా సహకరించాలని, తడి–పొడి చెత్తలను వేర్వేరుగా అందజేయాలని ఆమె ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు రాంబాబు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ఏడీసీ పర్యవేక్షణ

కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ మంగళవారం భానుగుడి, చార్మినార్ సెంటర్, శ్రీనగర్, కొత్తపాకలు, స్వర్ణాంధ్రకాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. రహదారులు, డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న పనులను పర్యవేక్షించారు.

అన్న క్యాంటీన్ల సందర్శన

నగరంలోని రామారావుపేట, సంతమార్కెట్ ప్రాంతాల్లోని అన్నా క్యాంటీన్లను అదనపు కమిషనర్ సుధాకర్ పరిశీలించి అక్కడి సేవలపై ఆరా తీశారు.